# తారుమారు బలే పెళ్ళి

నేను కోనసీమ పిల్లని. మీ పెత్తల్లిది కోనసీమ. మా అమ్మ సరేసరి-కోనసీమ వారి ఆడపడుచు. ఎందుకలా నవ్వుతారు? ఏమనుకుంటున్నారో "కోనసీమ" అంటే "కోటి రత్నాల సీమ"

మిమ్మల్నేమో పెద్దమనిషి అనుకొని మా వేలువిడచిన అన్నయ్య కోనసీమ పెళ్ళికి పిలిస్తే ఆడపెళ్ళివారి తరుపున వచ్చి తగుదునమ్మా అని మొగపెళ్ళివారిని "మట్టిమష్యులు" అన్నారట మీరు. మావాళ్ళంటే మీ కంత వేళాకోళాలుటండీ మరీనూ: మగపెళ్ళి వారికోసం చేయించి తెచ్చిన

"పూతరేకులు" బస్సులో పిల్లలకు పైగా పంచిపెట్టించేసి. మినపసున్ని ఉండలు. లడ్లు పెట్టిన డబ్బాలు ఎక్కడున్నాయో పిల్లలకు చూపించేశారుట:

సరదాకైనా ఓ హద్దూ పద్దూ ఉండాలి.

మా మార్కేండేయులు అన్నయ్యని "పాపా్మగుడు"–"మిస్టర్ మార్క్" అని ఎగతాళి పట్టించారట కదా!

కాగితాల మీద ఏవో బరుకుతారుగదా అని మిమ్మల్ని మావాళ్ళు "జెంటిల్మాను"గా చూస్తోంటే వాళ్ళని మట్టి మనుష్యులు అనడం ఏం బావుందీ?

మీ చెల్లెలు గీచిన గీటుదాటదు మా అన్నయ్య. చదువుకున్న దాని నసీ. అందమైన దానినసీ. అప్ టు డేటు గరల్నసీ "మీరజారగలడా నా యానతి" అన్నట్లు నా మొగుడు నా మాట జవదాటడనీ దానికెంత ధీమా? గర్వం? మా అన్నయ్యకు ముక్కుకు తాడుకట్టి ఆడించే మీ చెల్లెలు పాపకు నాబోటిదాన్ని కళ్ళకు కనిపిస్తానా? మిమ్మల్ని తలుచుకుని గర్వ పడదామంటే మీ కొంక దొక్కుకారు కూడా లేదాయె....మనింటికొచ్చే బాపతంతా రిక్షాలమీద వస్తారు. రిక్షాలమీద. ఎద్దుబళ్ళమీద వచ్చే చుట్టా లంటే మిస్టర్ మార్క్ గారి పెళ్ళానికి చెడ్డ చికాకు. కాస్త నలగా చామన చాయగా వున్నవారంటే వొళ్ళుమంట. మా మేనత్త కూతురికి. మరి శ్రీ కృష్ణుడు అంత జెట్ బ్లాక్ గా వున్నప్పటికీ ఆ విలేజి గరల్స్ అతని చుట్టూ వేల సంఖ్యలో తిరిగే వారట! కాస్త పెళ్ళికావలసిన పిల్ల కొంచెం నల్లగా వుంటే నీగ్రోసు చూసినట్లుగా కంపరమెత్తిపోయే మేనత్తలు, ఆడపడు చులూ వున్నారు. ఈ రోజుల్లో మగాళ్ళయినా ఆడవాళ్ళయినా ఏంత సింపు

లీగా వుంటే అంత బాగుంటారు గొప్పగా. డాబుగా, దర్జాగా వుండడానికి ఎంత ప్రయత్నిస్తే మనుష్యులు అంత అసహ్యంగా వుంటారు. డాబుగాళ్లు డాబుగాళ్ళతో తప్ప మాట్లాడరు. అందగత్తెలు అందగత్తెలనే పలక రిస్తారు. ఈ విధంగా చూస్తే నాబోటి నల్లని దానిని వెల్లదని ఎవరూ పలక రించకపోవచ్చు. ఎర్రగా బుర్రగా డాబుగా దర్జాగా వుండకపోతే పెళ్ళిళ్ళలో మర్యాదలు ఎక్కువ జరగవు. చీరలూ. నగలూ. పిల్లలూ. ఆ తరువాత రోగులూ. ఆపరేషన్లూ-ఆపరేషన్ల గురించీ రోగాల గురించీ ఎంత చెప్పు కుంటే అంత సుకుమారి సుశరీరి అని భావన.

చీరల్నుచూసి పీటలు వేస్తారు. మీ రంటె వేళాకోళాలు చేస్తూ దులుపుకుని తిరుగుతారు కానీ ఒక డొక్కు-కారు కూడా లేనివాడి భార్యను పిలిచి పీటవేసి కూర్చోపెట్టి ఎవరు గౌరవిస్తారు?

కోనసీమ వారితో కొంచెం జాగ్రత్తగా వుండండే అని చెబుతూ నేనే పప్పులో అడుగేశాను.

పాళీ అరిగిపోయేలాగ కాగితాలమీద బరుకుతారు కదూ- అందు కని మీకంతా రెస్పెక్టు ఇస్తారని మీరనుకుంటున్నట్లున్నారు.

మా వదిన. సుకుమారీ వదినా మంగళకర వదినా ....మాఅన్నయ్య పిల్లలెత్తుకుంటాడు' పిల్లల్నాడిస్తాడు. వాడి కదో సరదా-మీరు మా అన్నయ్యకు డైరక్టుగా అటాకిచ్చే సరికి మిమ్మల్నే మనలేక ఆ అగౌర వం అంతా వాకు చూపిస్తున్నారు.

పంట కాలువలు. కొబ్బరి చెట్లు. పనస కాయలతో పిల్లల తల్లిలా అడుగడుక్కీ నేత్ర పర్వంగా దర్శనమిచ్చే పనస చెట్లూ, మామిడి తోపులు రకరకాలపళ్ళ తోటలూ చూస్తానంటే వెళ్దామన్నాను.

గాని మా చుట్టాల్ని సమయం వస్తే పుచ్చు వంకాయలు ఏరి పారేసినట్లు ఏరి పారేస్తారని తెలుస్తే నేను మిమ్మల్ని గడపదాట నిచ్చేదాన్ని కాదు.

జరీఅంచు పవిట చెంగుతో మీరెండు చేతులూ గట్టిగా బిగించి ఏ రోలుకో మంచం కోడుకో కట్టిపారెయ్యాలి।

అతను మా అన్నయ్య. వెనక బెజవాడోసారి వచ్చాడు. అప్పుడు వాళ్ళ స్నేహితులెవరికో పెళ్ళన్నాడు శుభలేఖ చూపించాడు. పెళ్ళికూతురి కని ప్రయిజు కొనిపించారు కూడా బజారు కెళ్ళి అంతవరకూ సవ్యంగానే వుంది. ఆ రిక్షావాడికి ఫలానా సుబ్బారావు గారింటికని మీ రిచ్చిన అడ్రసు చెడ్డగంద్రగోళం తెచ్చి పెట్టింది.

ఎంతమంది సుబ్బారావుల్లేరు? ఎంతమంది సత్యనారాణలు లేరు ఆంధ్ర దేశంలో—ఈ మామిడిపళ్ళ సీజన్లో పెళ్లిళ్ళసీజను కలిసివస్తే అందరిళ్లల్లోనూ పెళ్లిళ్లే గదా।

ఈ రిక్షావాడు మీరు చెప్పిన అడ్రసుకు తీసు కెళ్లి ఇదే సుబ్బా రావుగారిల్లు. గవర్నరుపేట సింహాలమేడదగ్గిర అని మాఅన్నయ్యను దిగ బెట్టాడ్ట. అప్పటికి పెళ్లి తలంబ్రాలూ, చదివింపులూ దగ్గర వుందట. మీకు తెలుసుగా మా అన్నయ్య వట్టి కంగారు మనిషిని-ఆ ప్రయిజూ, వెండి కప్పూ-సాసరూ చదివించే ఆయన దగ్గర వుంచి చందన తాంబూలా దులు అందుకుని ఇటూ అటూ చూస్తున్నాడట. ఇంతలో కాఫీ ఫలహారా లకు, అట్నుంచదే అర్ధంటు అతిథులకు భోజనాల ఏర్పాటు జరిగే పందిట్లోకి లాక్కు-పోయారట. మీకు తెలుసుగా మా అన్నయ్యకు "పేకాట" చిన్న వీక్నెసు అనీ. ఆ ఫలహారాలూ, విందూలూ, అయ్యాక పెళ్ళివారి విడిదిలో "పేకాట"కు కూర్చున్నాట్ట

ఇంతలో పెళ్ళికొడుకూ — పెళ్ళి కూతురూ పాదాభివందనం చేయడానికి వచ్చారుట.

అప్పుడు మా అన్నయ్యకు ముచ్చెమటలు పోసేశాయి. గుడ్లు మీదకు వెళ్ళిపోయాయి. పేకాటలోంచి లేచి ముక్కలు పక్కనకూర్చున్న వాడి చేతిలో పెట్టి తువ్వాలుమీద డబ్బులేన్నా ఏరుకోకుండా తెలిసిన కాకినాడ వంట బ్రాహ్మలని శరణుజొచ్చి- ఆ హోల్డాలు. సూటుకేసూ బైట పెట్టించుగుని — ఆ రాత్రి చీకట్లోతిరిగి కంటికి కనిపించకుండా వనములను దాటి వెన్నెల బయలుదాటి. విపనములుదాటి దుర్గమాద్రులను దాటి అన్నట్లు ప్రాణాలతో స్టేషనుకొచ్చి పడి రాజమండ్రి టికెట్టుచ్చుగున్నాట్ట- ఆ వెండికప్పూ సాసరూ పెళ్ళికూతురికి ప్రాప్తం. అది సరే లెండి గాని. సుబ్బారావుగారి ఇల్లండే రిక్షావాడికి మీరు ఇలాగేనా అడ్రసు ఇవ్వడం?

అందుకనే మా అన్నయ్య వాళ్ళు మిమ్మల్ని జెంటిల్మాను. అనుకోవడంలేదు పైపెచ్చు మీరు అజోకును బ్రహ్మాండంగా పెళ్ళి పందిట్లో సర్వులకీ చెప్పడం మాఅన్నయ్య "మిష్టర్ మార్క్"కి పుండుమీద కారం జల్లినట్లుగా వుండమంటే ఉండదూ

అందుకనే కోనసీమ పెళ్ళికి వెళ్తే మీ కెంత గౌరవం ఇవ్వాలో అంతా నాకూ ఇచ్చారు.

పెళ్ళి శుభవేళ సరిగా చూడకుండా ఇంకెవరికీ అటువంటి ఉచిత సలహాలూ అడ్రసులూ ఇవ్వకండి.

ఇవ్వనని ఒట్టేయండి.